# ముప్పయి లక్షల పందెం

బాల్యక్రీడల ఋతువులు వేరు. బొంగరాలు, అల్లీలు, గాలిపడగలు, బిళ్ళాకర్రా మొదలైన అనేకానేక ఋతువులు ఉన్నాయి. వీటిధర్మాలు నిఖరంగా చెప్పడం వృత్తభుజాలను లెక్కించటం అంత సులువైనపని. విశాఖపట్టణంలో నా చిన్నప్పటి రోజుల్లో ఒక ఋతువు కొత్తగా జన్మించడం జరిగింది. అదే సిగరెట్టు పెట్టెలాట.

ఈ మహాక్రీడని ఎవరు కనిపెట్టేరో తెలుసుకోడం చాలాకష్టం. ఇది మావూళ్లోనే తయారయిందని ధీమాగా చెప్పుకోడం అంతకన్నా కష్టమైంది. విజయనగరం నుండిగాని, అనకాపల్లి నుండి గాని దిగుమతి అయిఉండడానికి అవకాశం ఉండి ఉండవచ్చు. ఈఆట ఎలా ఆడుతారో ముందు తెలియ పర్చవలసిన బాధ్యత ఎంతేనా నామీద ఉందనుకొని ఉపక్రమిస్తునా.

సిగరెట్టుపెట్టెలకి రెండుపక్కలుంటాయి. రెండు పక్కలూ చింపి, రూపాయినోట్లలాగా జాగ్రత్తచేయాలి. పేకముక్కల్లాంటి ఈ నోట్లకి విలువలు నిర్ణయించబడతాయి. విల్సుకి వెయ్యి, ప్లెయిర్సుకి వెయ్యి, కత్తెరకి అయిదువందలూ, పాసింగ్‌షోకి వందా, బేర్సుకి యాభై, చారుమినారుకి అయిదూ ఇలా విలువలు ఉంటాయి. ఇప్పుడు ఉజ్జాయింపుని చెప్తున్నాను, అసలు విలువలు మర్చిపోయేను.

ఈ నోట్లని ప్రతి ఆటగాడూ ముందు జాగ్రత పరుచుకోవాలి. పిదప ఆటగాళ్లు ఒక గిరి వృత్తాకారంలో గీసి

అందులో పందెం పెట్టాలి. మర్చిపోయాను, ఈ ఆటలో మరో ముఖ్యమైన పనిముట్టు తాండ్రబెత్తు. పందెం వేసిన తర్వాత గిరి దగ్గిర నిలబడి మొదటి ఆటగాడు తన బెత్తుని తనని అభిముఖంగా నేలకి సమానాంతరంగా విసురుతాడు. తతిమ్మావాళ్లు, దాన్ని గురిచూచి తమ బెత్తులు, ఒకరి తరవాత ఒకరువిసరాలి. ఈ విసరడంలో మొదటివాడిబెత్తుని ఎవడు కొట్టగలడో వాడికి ఆ పందెం డబ్బంతా పోతుంది. గాని, ఈ రెండోవాడి బెత్తుని మూడోవాడు కొట్టగలిగేస్తే వాడికే ఆ సొమ్మంతా చెందుతుంది. ఇలాగ ఎందరు ఆట గాళ్ళు వుంటే అందరు. లేక ఎవరూ తొలివాడి బెత్తుకొట్ట లేకపోతే ఆటసాగే విధం ఏమిటంటే–

తొలి ఆటగాడు బెత్తుపడ్డ చోటునుంచి గిరికి అభిముఖంగా నిలబడి గిరిమధ్య పెట్టబడిన డబ్బును గురిచూచి బెత్తుని విసరాలి. నోట్లని బెత్తు తాకితే ఆ డబ్బంతా వాడి అధీనమవుతుంది. లేదా తక్కిన ఆటగాళ్ళుకూడా తొలివాడిలా తమ బెత్తుల్ని విసిరి తమ అదృష్టాన్ని పరీక్షించుకొంటారు. ఆ తరవాత ఒక్కొక్కరూ, వరుస ప్రకారం బెత్తుతో గిరిలోవున్న నోట్లని గిరిపైకి వచ్చేటట్లు కొడతారు. ఒక్కొక్కసారి ఎంతడబ్బు పైకొస్తే అంతా ఆ ఆటగాడికి లాభం. చివరి నోటు పైకొచ్చేదాక ఆట సాగుతుంది. తిరిగి కొత్తగా మరోసారి ఆట ప్రారంభించవచ్చు.

ఈ విధమైన ఆట 'ఉకం వీథి'లో ఆడుకొంటున్న రోజుల్లో ఒకనాడు రాంభొట్లవారి ప్రసాదంగాడు వచ్చి మాకో కొత్తరకం సిగరెట్టుపెట్టి చూపించేడు. అది మా

జన్మలో మే మెన్నడూ చూడలేదు. వాడు బొంబాయిలో దానికి లక్ష విలువ ఉంది అని ప్రకటించాడు, మేము అభ్యంతరం పెట్టలేదు అది వాళ్ళన్న మిలట్రీనుంచి తెచ్చేవాడని వాడు చెప్పేడు. మిలట్రీ సిగరెట్టు పెట్టె కాబట్టి మేము ఏకగ్రీవంగా దానికి లక్ష విలువ ఉందని తీర్మానించాం.

ప్రసాదం గాడిని తలొకటి చొప్పున పంచిపెట్టమని వినయ విధేయతలతో కోరాము. వాడు సమ్మతించలేదు. వాడిదగ్గర అలాంటివి ముప్ఫయి ఉన్నాయి, కాబట్టి మాకు ఇవ్వననడంలో వాడి పిసినిగొట్టుతనాన్ని అందరం ఖండించేం. వాడు వింటేగా!

చివరికి ఒకషరతు పెట్టేడు. వాడి ముప్ఫయిలక్షలూ ఒకేసారి వాడు పందెం వేసి గెల్చుకోమన్నాను. మేం వప్పుకోలేదు మా అందరిదగ్గరా ఉన్నది కలసినా ముప్ఫయి లక్షలు లేవు. అంచేత రెండు రెండు లక్షలుగా పందెం వెయ్యమన్నాం. వాడు అంగీకరించలేదు గరుడ నాన్నయలు చిన్నం వీధిలో విల్సుకి పదివేలు అని సమయానికి అన్నాడు. మా కరెన్సీకి అవసరాన్నిబట్టి విలువల హెచ్చుతక్కువలు సంభవిస్తూ ఉంటాయి. ప్రసాదంగాడు ఇది అన్యాయం అన్నాడు. గాని మా అందరి ఆమోదాన్ని పొంది విల్సుకి పదివేల విలువ లభించింది.

అయినా మా అందరి దగ్గరా కలిపి ఇరవైఅయిదు లక్షల చిల్లర అయింది. మేమూ ప్రసాదంగాడితో ప్రకాశాన్ని ఆడమన్నాం. గిరాట (ఈఆటకి మరోపేరు)లో వాడు అందెవేసిన చెయ్యి. జెత్తు విసరడంలో నోట్లని గిరిపైకి తియ్య

డంలో సులువులెన్నో వానికి కరతలామలకం. ప్రకాశం గాడు వప్పుకున్నాడు. కాని ఆర్థిక ప్రతిష్టంభన వేర్పడ్డది. ధనానికి కొరత ఏర్పడ్డది.

సమిష్టిగా మేమంతా ప్రసాదంగాడిని ఒక అయిదు లక్షలు అప్పు ఇమ్మని ప్రార్థించేం. మాకు ధైర్యంఉంది ప్రకాశం గెలుస్తాడని. ప్రసాదం మొండిపట్టు పట్టాడు, ఇవ్వను గాక ఇవ్వను అన్నాడు. పోని పందెం ఇరవై అయిదులక్షలే పెట్టుకుందాం అంటే, నేటి జిన్నాలాగ వాడు ప్రసాదం ససేమిరా అన్నాడు.

చేసేదిలేక పైరాజ్యాలనుండి ధనసహాయం అర్థించేం. చిన్నంవారి వీధి, పప్పులవీధి ఈవార్త పాకింది. ఆ వీధుల్లోని హేమాహేమీలు వచ్చి ఈ మహాపందెం వీక్షిస్తున్నారు. చిన్నం వీధివాళ్ళు ఒక షరతుమీద ఇస్తామన్నారు. అది ప్రకాశం గెలిచినప్పుడు దానిలోని కొత్త లక్ష ముక్కలు పది వాళ్ళకివ్వడం, లేక ఓడిపోయినపక్షంలో పదిహేను లక్షలు మూడురోజుల్లో యివ్వడం – ఈ ఒడంబడికమీద మా అందరి సంతకాలు పెట్టినంతగా మేం ఒప్పుకున్నాం.

తీరా, ముప్పైలక్షలూ పందెంగిరిలో పెట్టేక ప్రసాదంగాడు చిన్నంవారి వీధిలోని నాగులకొండవారి అబ్బాయిని మీ వీధిలో ఇల్లుకి విలువ ఎంత అని అడిగాడు. వాడు మామూన్నాలుగా వెయ్యి అని చెప్పగానే ప్రసాదంగాడు చిర్రుసలేచి అన్యాయం జరిగిపోతున్నాది అని మొత్తుకోడం

ప్రారంభించేడు. చూస్తున్న తగు మనుష్యులు విల్సుకి వెయ్యి అని అభిప్రాయాన్ని వెలిబుచ్చేరు.

ఇంతదాకా జరగనిచ్చి ఆట సాగకపోడం మంచిది కాదని పప్పులవీధి పసుపర్తి వెంకట్రావు తనని ఆడనిచ్చి మాటుంటే ఎంత సర్దాలో అంతా సర్దుతానని అన్నాడు. మేం వప్పుకోలేదు; ఏవంటే వెంకటరావుకి ఆట ఏమీరాదు. అయితే ఓ చార్మినారు కూడా యివ్వనని పప్పులవీధిలో వాళ్ళెవరూ ఇవ్వకూడదని వెంకడిరావు బెదిరించెడు.

ఇంతట్లోకే నాన్నయులు ప్రసాదంగాడు మనల్ని మోసంచేస్తున్నాడు, దానికి లక్ష విలువ లేదని అన్నాడు. మాకు ఈ సత్యం రుచించలేదు. బొంబాయి మిలట్రీ సిగరెట్టు పెట్టె [కి] లక్ష విలువ చెయ్యకపోవడమేమిటి అని ప్రసాదంతో పాటు మేమూ అన్నాం.

చివరికి ఎలాగైతేనేం ప్రసాదంగాడు మా దగ్గర వున్నంతి మట్టుకే పందెం వేసేఁదికి ఒప్పుకున్నాడు. ఆటని ప్రారంభించేం. ఉద్రేకంలో ప్రసాదమే ముందు బెత్తు విసిరేడు. ప్రకాశం దాన్ని సులువుగా కొట్టి ఆట గెలుచుకొంటాడని మేం ఆశపెట్టుకొన్నాం. ప్రకాశం కొట్టలేదు. ప్రసాదంగాడు రెండోసారి బెత్తుతో కట్టంతటినీ తట్టి ఆట గెలుచుకొన్నాడు.

ఆ గర్వంతో వాడు (లేని) మీసంతిప్పి, తొడచరిచి, 'ఏక్ దో తీన్ చార్ పాంచి బజానా. అల్లఉకం వీధిమదుం మీద నిలుపు జమానా' అని పెద్దగా పాడి సవాలు చేశాడు. ప్రకాశంగాడి ఒళ్ళుమండి ప్రసాదం గాడిమీద విరుచుకు

పడ్డాడు. మేమూ కలియబడ్డాం. వాడి చేతులలోని డబ్బంతా చింపేశాం. వాణ్ని కిందపడగొట్టి వాడి లాల్చీ చింపేశాం. తగు మనుష్యులు చిన్నంవీధి నాగులకొండా, పప్పులవీధి పసుమర్తి వాళ్ళవాళ్ళ అనుచరులతో పోరాటాన్ని ఆపేరు.

కందగడ్డలాంటి మొగంతో ప్రసాదంగాడు 'మా మిలట్రీ అన్నయ్య తుపాకీ తెచ్చి మిమ్మల్ని గుండేసి కొట్టక పోతే నాపేరు రాంభొట్లప్రసాదం కాదు' అని వెళ్ళిపోయేడు. వాడి లాల్చీఅంతా చిరుగులే, వాడి ఒళ్ళంతా రక్కుళ్ళే.

అ తతో ఆ సంవత్సరానికి మావూళ్లో గిరాటఋతువు అంతమైంది.